క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

ఎంపీడీఓ విశ్వప్రసాద్

తాండూరు రూరల్: బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా పల్లెల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ విశ్వప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండగ సందర్భంగా గ్రామాల్లో వీధి లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉండకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. బతుకమ్మలను నిమజ్జనం చేసే చెరువులు, కుంటలు, వాగుల వద్ద శుభ్రం చేయించాలన్నారు. అలాగే ప్రజాపాలనలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులకు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఆనంద్‌రావు, పంచాయతీ కార్యద ర్శులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో సుధాకర్‌రెడ్డి

అనంతగిరి: పేదింటి ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు కొండంత అండ అని కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ ప్రసాద్‌కుమార్ అందుబాటులో లేనందున ఆయన సూచన మేరకు చెక్కులు పంపిణీ చేస్తున్నామన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రత్నారెడ్డి, అనంత్‌రెడ్డి, కౌన్సిలర్లు చందర్‌నాయక్, వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ముత్తాహర్ షరీఫ్, రెడ్యానాయక్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్, ఖాలెద్, ఆనంద్, నాగరాజు, జంగయ్య, జిలాని, ప్రవీణ్, విజయ్, నరేందర రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాయకుల నివాళి

కుల్కచర్ల: స్థానిక గ్రామానికి చెందిన కాటనిపల్లి హన్మంతు ముదిరాజ్(45) ఆదివారం అర్ధరాత్రి గుండె సంబంధిత సమస్యతో ఆకస్మికంగా మృతిచెందారు. ఆయన పరిగి మండలం జాఫర్‌పల్లి ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో పీఈటీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి, హ్యూమెన్ రైట్స్ జిల్లా కోఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్‌లు మృతదేహానికి నివాళులర్పించారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల ముకుందం, డీసీసీ కార్యదర్శి హన్మంతు ముదిరాజ్ సంతాపం తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

మర్పల్లి: బీజేపీ సభ్యత్వ నమోదుకు మండలంలో అనూహ్య స్పందన లభిస్తుందని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పట్లూర్ గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 150 మంది పార్టీ క్రియాశీల సభ్యత్వం తీసుకున్నారని ఆయన తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చూస్తుంటే గ్రామాల్లో పీఎం మోదీ పాలనపై ప్రజలు ధీమాగా ఉన్నారన్నారు. అందుకే నేరుగా వచ్చి సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మహిళ మోర్చా జిల్లా కార్యదర్శి మహేశ్వరి, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

షాబాద్: కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎన్నికైన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథ కం మహిళలకు వరం లాంటిందని, మహిళల సాధికారత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నా రు. త్వరలో మిగిలిన గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జనార్ధన్‌రెడ్డి, ఖాజా మీయా, రవీందర్‌నాయక్, ఆంజనేయులు, మునగపాటి నర్సింహులు, నాయకులు ఉన్నారు.

కేశంపేట సీఐగా నరహరి

కేశంపేట: కేశంపేట పోలీస్ స్టేషన్‌కు ఎస్‌హెచ్‌ఓగా ఎస్‌ఐ విధులు నిర్వహించేవారు. కొత్తగా సీఐని ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. ప్రభుత్వ బదిలీల్లో భాగంగా ఎకనామిక్ ఆఫీసెస్ వింగ్ నుంచి నరహరి బదిలీపై వచ్చారు. సోమవారం నూతన సీఐగా నరహరి బాధ్యతలు స్వీకరించారు. సీఐకి ఎస్‌ఐ రాజ్‌కుమార్‌తో పాటు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల ఊసే లేదు

- తూతూమంత్రంగా గ్రామసభలు
- ప్రజల భాగస్వామ్యం లేకుండానే సమావేశాలు
- గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ కరువు



దౌల్తాబాద్ గ్రామపంచాయతీ కార్యాలయం

దౌల్తాబాద్: ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామసభలు తూతూమంత్రంగా సాగుతున్నాయి. గ్రామ పంచాయతీల్లో నిర్వహించే గ్రామసభలకు అధికారులు హాజరయ్యారా, సంతకాలు పెట్టారా అన్నట్లుగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ప్రతి రెండు నెలలకోసారి నిర్వహించే గ్రామసభలపై ప్రజల్లో అవగాహన కలిపించకపోవడంతో సమస్యలు ఎక్కడికక్కడే తిష్టవేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు, లబ్ధిదారుల ఎంపిక వివరాల నమోదును సభల ద్వారా వివరించాలి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న గ్రామసభలు ఆయా గ్రామాల్లో నామమాత్రంగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

- మండలంలో పలు గ్రామాలకు సొంత భవనాలు లేక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- సొంత భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు.
- గ్రామసభ నిర్వహించే తేదీని ఒకరోజు ముందుగానే పంచాయతీతో పాటు అనుబంధ గ్రామాల్లో కార్యదర్శులు సిబ్బందితో దండోరా వేయించాలి.



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

- నిబంధనల ప్రకారం విధిగా వివిధ శాఖల అధికారులు, ఊరి జనాభాలో సుమారు 20శాతం మంది గ్రామసభకు హాజరయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
- రెండు నెలలకోసారి కార్యదర్శులు పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాలి. సభకు హాజరయ్యే అధికారులు గ్రామంలోని సమస్యలను నమోదు చేసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేయాలి. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన ఉన్నందున సభలను పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్నారు.
- పంచాయతీల ఆదాయ వ్యయాలపై నివేదికలను కార్యదర్శులు చదివి వినిపిస్తారు. కానీ ఆయా నిబంధనలు మండలంలో ఎక్కడా అమలు కావడంలేదు.

ప్రజల భాగస్వామ్యం ముఖ్యం

గ్రామసభలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం. సభల నిర్వహణపై కార్యదర్శులు గ్రామాల్లో దండోరా వేయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ప్రజలు సభకు స్వచ్ఛందంగా హాజరు కావాలి. గ్రామసభల నిబంధనలను తప్పక పాటించాలి. ఈ గ్రామ సభల ద్వారా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తారు.

– శ్రీనివాస్, ఎంపీడీఓ, దౌల్తాబాద్

సైబర్ నేరాలపై జాగ్రత్త అవసరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న షీటీం

పరిగి: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని షీటీం ఇన్‌చార్జి నర్సింహులు అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు సైబర్ నేరాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడైన మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను నిర్మూలించేందుకు షీటీం ఎల్లప్పుడు పనిచేస్తుందన్నారు. ఎక్కడ ఎలాంటి సంఘటనలు జరిగినా వెంటనే 100 డయల్ చేయాలని సూచించారు. విద్యార్థులు తమ కుటుంబంలోని తల్లిదండ్రులు, ఇతరులకు ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో షీటీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి తీవ్ర ఇబ్బందులు



ఎస్సీకాలనీలో పాడైన బోరును చూపిస్తున్న యువకులు

కుల్కచర్ల: మండల పరిధిలోని మందిపల్ గ్రామంలో పలు కాలనీల్లో తాగునీటి సమస్య నెలకొంది. మిషన్ భగీరథ నీరు మూడు రోజుల నుంచి రాకపోవడంతో బోర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామ పరిధిలో ఉన్న బోర్లు పాడై పోవడంతో ఎస్సీ కాలనీలో ఇబ్బందులు నెలకొన్నాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని, ఇటీవల రెండు రోజులకు ఓసారి నీరు వస్తున్న పరిస్థితి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వరూపను వివరణ కోరగా.. గ్రామ పరిధిలో 13 బోర్లు పనిచేస్తున్నాయని, ఎస్సీ కాలనీలో గ్రౌండ్ వాటర్ ఎక్కువగా లేని కారణంగా బోరు పాడవుతుందని తెలిపారు. ప్రస్తుతం జీపీలో నిధులు సరిగ్గా లేకపోవడంతో ఇబ్బంది నెలకొందని ఆమె చెప్పారు. గత రెండు రోజులుగా మిషన్ భగీరథ నీరు పైనుంచి రాకపోవడంతో సమస్య తీవ్రమైందన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



మహిళలకు గ్యాస్ ప్రొసీడింగ్‌లను అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

దోమ: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పీఏసీఎస్ డైరెక్టర్ యాదవరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు గ్యాస్ ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముందుకు సాగుతున్నారని అన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శాంతకుమార్, అంతిరెడ్డి, భాస్కర్, రాము, శేఖర్, బషీర్, రమేశ్, ఇంతియాజ్, మల్లారెడ్డి, ప్రభు, హైమద్, ముబేర్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నాపరిమళ్



వీధి శునకాలకు శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

తాండూరు టౌన్: తాండూరు మున్సిపల్ పరిధిలో కుక్కల బెడదను తగ్గించేందుకు ముమ్మర చర్యలు ప్రారంభించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నాపరిమళ్ అన్నారు. సోమవారం స్థానిక డంపింగ్ యార్డులో హైదరాబాద్, వికారాబాద్ నుంచి వచ్చిన వెటర్నరీ డాక్టర్లు వీధి కుక్కలకు సంతానోత్పత్తి నియంత్రణకు శస్త్రచికిత్స చేశారు. ఇటీవల 20 కుక్కలను పట్టుకుని డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసిన ఎనిమల్ కేర్ సెంటర్‌లో పెట్టిన విషయం విదితమే. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. వీధి కుక్కల దాడుల్లో పలువురు చిన్నారులకు గాయాలవ్వడంతో చర్యలు చేపట్టామన్నారు. శస్త్రచికిత్స చేసిన కుక్కలను మూడు రోజుల అనంతరం వదిలేస్తామన్నారు. చైర్‌పర్సన్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా బతుకమ్మ సంబురం



అనంతగిరి: బతుకమ్మలతో మహిళా అధికారులు



తాండూరు టౌన్: మెడికల్ కళాశాలలో..



వికారాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో..

రాష్ట్ర పండగైన బతుకమ్మ సంబరాల్లో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయా చోట్ల బతుకమ్మలను చూడచక్కగా అలంకరించి ఇంటిముందు పెట్టి హారతి ఇచ్చి వీధిలోకి తీసుకువచ్చారు. అనంతరం సామూహికంగా బతుకమ్మ ఆటపాటలతో సంబురంగా వేడుకలు నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్



బొంరాస్‌పేట: తుంకిమెట్లలో యువతుల సంబరం



కుల్కచర్ల: అల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో..



కుల్కచర్లలో..



పరిగి: లక్ష్మీదేవిపల్లిలో మహిళా సంఘం..

విద్యా ప్రమాణాలు పెంపొందాలి



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

దోమ: విద్యా ప్రమాణాలు పెంపొందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ప్రథం సంస్థ మండల కో ఆర్డినేటర్ మురళీకృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో విద్యార్థులకు గణిత శాస్త్ర మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి విద్యలో మెరుగైన ఉత్తీర్ణత సాధించాలంటే అవసరమైన సాధన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా గణిత శాస్త్రంలో విద్యార్థులు తడబడుతుంటారని, అలాంటి సబ్జెక్ట్‌ను ఈజీగా నేర్చుకునేలా ప్రాక్టికల్ చేసి విద్యార్థులకు చూయించారు. అనంతరం పజిల్స్, గేమ్స్, గణితక్రియలు, మొదలగు అంశాలపై చార్ట్ రూపంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అనంతుడి ఊరేగింపు



గరుడ వాహన సేవలో పాల్గొన్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

అనంతగిరి: వికారాబాద్‌లో వెలిసిన శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా సుప్రభాతసేవ, అర్చనలు, ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి ప్రత్యేకహారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి 8 గంటలకు స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఆలంపల్లి వార్డు ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జగన్మాత వైభవం.. భక్తుల పరవశం



ధారూరు: మహాచండీదేవి అవతారంలో అమ్మవారు



అనంతగిరి: వైభవలక్ష్మి ఆలయంలో



ధారూరు: కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



తాండూరు టౌన్: లలితా త్రిపురసుందరీ దేవిగా అమ్మవారి అలంకరణ

జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో ఆలయాలు, మండపాల వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో దుర్గమ్మను కొలిచి మొక్కులు చెల్లించుకుంటున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. మండపాల వద్ద మహిళలు పెద్ద ఎత్తున గుమిగూడి బతుకమ్మలతో ఆడి పాడారు.

– సాక్షి, నెట్‌వర్క్



కుల్కచర్ల: పాంబండ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



దుద్యాల్: హస్నాబాద్‌లో దుర్గామాత మండపం



మర్పల్లి: కోట్‌మర్పల్లిలో చండీదేవి అలంకరణలో కొలుస్తున్న భక్తులు



బొంరాస్‌పేట: పూజలో చిన్నారులు